CHECKED-75

# సతీదేవి

నాళం. అప్పలనరసింహముచే

బ్రచురింపఁబడినది

1387

CHECKED

రాజమహేంద్రవరము.

౧౯౨౭

సర్వస్వామ్యసంకలితము.] [వెల రు. ౦-౧౨-౦.

# అంకితము

ఉదారహృదయులును, పావనచరితులును,
వితరణశీలురునగు

మహారాజశ్రీ, శెగింబి - హనుమంతరావు
పంతులు, బి. ఏ., బి. ఎల్.,

గారికీ గ్రంథమును కృతజ్ఞతా పూర్వకముగ
నర్పించుచున్నాను.

గ్రంథకర్త

# పీఠిక

వాగర్థావివ సంపృక్తౌ
వాగర్థ ప్రతిపత్తయే
జగతః పితరౌ వన్దే
పార్వతీపరమేశ్వరౌ.

అష్టైశ్వర్య సంపన్నుఁడైన శివుఁడు కైలాసమును వదలి, అమరులకు నమృతమొసఁగి, తాను కాలకూటమును ద్రావి, జటాజూటమును ధరించి, పులిచర్మము గప్పుకొని, సన్యాసియై, శ్మశానవాటికను నివాసముగాఁ జేసికొనియెను. ఆమహామహుని భోగభాగ్యంబుల లక్షింపక, దక్షప్రజాపతి పుత్త్రికయగు సతి కేవలము సంపూర్ణానురాగబలంబున నాతని హృదయేశ్వరునిగ వరించి, అర్ధాంగలక్ష్మియై తనరుచుండ, కొంతకాలమునకుఁ బిమ్మటఁ దండ్రియగు దక్షుని యజ్ఞమున నవమానితయై, యోగాగ్నివలనఁ బ్రాణంబులు

వాసి, నేలంగూలె. అత్తఱి కైలాసమునఁ దపోనిష్ఠనున్న పరమేశ్వరుం డకారణముగఁ గనుదెఱచి, తత్తరమున లేచి 'సతీ! సతీ!' యని యెల్లయెడల వెదకుచుఁ గాన లేక, ఇంతలో కనకఖలములోని యజ్ఞము స్ఫురణకు వచ్చి, యజ్ఞశాలకుం జని, అనురాగ వశంబునఁ బరవశుఁడై, సతీ కళేబరమును నఱకట నిడికొని, ఆనందమై, స్వచ్ఛమై, అత్యంత పవిత్రమైన ప్రేమావేశమునఁ దన్మయతం జెంది, బ్రహ్మాండంబు కలయ నర్తనంబు సేసె.

అతఁడు పాదంబిడిన చోటెల్ల పావనంబయ్యె. ఆ నాట్యవేగంబునఁ బ్రేమస్వరూపిణియగు సతియొక్క— శరీరశకలంబులు భూనభోంతరాళము లెల్లెడ నిండి పవిత్రంబు గావించెను. అంతటఁ బరమేశ్వరుండు శాంతి జెంది మరల సతితోడఁ గూడుటకుఁ దపోనిష్ఠను బూని మైమఱచెను. ఇదియె ఈ గ్రంథరాజము నందలి కథాసంగ్రహము.

పార్వతీ పరమేశ్వరులు పురాణ దంపతులు. ఈ యనాది జాయాపతులయందుఁ బరమోత్కృష్టమగు ప్రేమతత్త్వము ప్రతిబింబితము. విశ్వవ్యాప్తమైన యీ మహోన్నతభావము భరతఖండ మెల్లయెడల నిండి, అన్యోన్యమై, పావనమై, అర్ధనారీశ్వర స్వరూపమునఁ బూజ్యమై విలసిల్లుచున్నది. ఇదియే యింటింట శుభకార్యా

రంభమున "గౌరీపూజ" గఁ బరిణమించినది. ఈతత్త్వమే కవీంద్ర చంద్రుఁడగు కాళిదాసుని హృదయమునం దుపలబ్ధిం జెంది "వాగర్థావివసంపృక్తౌ" అను వాక్యరూపంబునఁ బ్రకాశితం బయ్యెను. ఈ పరమార్థమే యీగ్రంథమునందు మృదుమధురంబగు తెలుంగునఁ దేటయయ్యె.

గుంటూరు 1—8—15. } కొండ - వేంకటప్పయ్య.



ఓం

# సతీదేవి

---

## మొదటి ప్రకరణము

దక్షుఁడు మహాదైశ్వర్యవంతుఁడు. తపోధనుఁడు. పరాక్రమశాలి. ఆతఁడు చేసిన యాగములు, యజ్ఞములు, దానధర్మములు, గణనాతీతములు. అందువలన దక్షునితోఁ దులతూఁగఁదగిన రాజు భూమండలమందు మఱి యొకఁడు లేకుండెను.

దక్షప్రజాపతి రాజధాని కనకఖలము. అది హరిద్వారముకడ నున్నది. నిరుపమాన సౌందర్యములచే నలరారుచుండిన యా పట్టణము నేఁడు గాన్పింపకున్నను, ఆ ప్రదేశ

మిప్పుడును, ప్రకృతి సౌందర్యమువలన నద్వితీయమై యున్నది. దీని నానుకొని యున్న హిమవత్పర్వత శిఖరము లొకటికంటె నింకొకటి మించి చంచలములేని మేఘమాలికవలెఁ గాన్పింపుచుండును. ఆ మహాపర్వతరాజము నుండి గంగానది గొప్పసర్పమునుబోలి చుట్టి చుట్టి తిరుగుచుఁ బ్రబలవేగమునఁ గ్రిందికిఁ బ్రవహింపుచుండును. ఆ దృశ్య మెంతయు హృదయరంజకము గదా!

కనకఖలముకడ గంగానదీ శోభ వర్ణనాతీతము. అచ్చటి జలము స్ఫటికముభంగి స్వచ్ఛమై యొకచోటఁ బాలవలెఁ దెల్లగను, మఱియొకచోట గగనముపగిది నీలముగ నుండి, నదీగర్భమందలి చిన్నచిన్న రాళ్లు గూడఁ గన్పట్టుచు నయనానందమును గలిగింపుచుండును. గంగను జూడవలయుననినఁ గనకఖలము, లేక హరిద్వారమునొద్ద నంద

ర్శింపవలయును. అప్పుడే గంగా మాహాత్మ్యరీ
ము హృదయంగమ మగును! అందువలననే
యార్యఋషులు ముగ్ధులై గంగామతల్లి
నంతగా స్తోత్రముఁ జేసియున్నారు. కనక
ఖలము నానుకొని ప్రవహించు గంగానదిని
నీలధార యందురు. నవరత్నమండిత మగు
దక్షప్రజాపతి సౌధరాజము దాని యొడ్డుననే
యుండెను. వర్షకాలమందా నీలధార దక్షుని
ప్రాసాదము నంటి ప్రవహించు చుండుటవలన
నచ్చటివా రాప్రవాహముయొక్క మృదు
మధుర గాన మాలించుచు, నిద్రించుచుండిరట్టు

దక్షప్రజాపతికిఁ బుత్రికలు చా[illegible]యింకా
కలరు. వికసితకమలములచే నొప్పు[illegible] నింకొక
వరమువలెఁ దారకాగణమ[illegible]చేవడ 'అమ్మా!
నాకాశమునుబోలి[illegible] రేపు తెచ్చిపెడతాలే. ఏడం
పుత్రికామణులతో[illegible] గొన్ని బొమ్మల సంతోషము
రూపలావణ్యము[illegible]చు, మఱికొన్ని బొమ్మల యే

తలిదండ్రు లానందమునం దోలలాడుచుండి రని వేఱుగఁ జెప్పవలయునా?

ఆబాలికలు ప్రతిదినమును నీలధార కేగి స్నానమాడి, మెరుపు, తెలుపు, పసుపు, నీలము మొదలగు రంగురాళ్ల నేరి యొడియందు వైచుకొని, తమతమ రాళ్ల నొండొరులకుఁ జూపించుకొనుచు సంతసించుచు గృహమును జేరుచుండిరి.

ఒక దినమున రాజమహిషి యగు 'ప్రసూతి' సతినిజూచి నవ్వుచు నిట్లనియె. "సతెమ్మా! ఈ రాళ్లెందుకే? ఇంటినిండ వజ్ర స్వచ్ఛ[illegible]వ్యములు కొల్లలుగఁ బడియున్నవి మఱియొక[illegible]మ్మా! వానితో నాడుకోరాదా?" [illegible] నుండి, నదీ సతీదేవి తా నేరుకొని వచ్చిన [illegible] గూడఁ గన్పట్టుచు నయన[illegible]కొనుచు దానిమ్మ గింపుచుండును. గంగను [illegible]ఘమధుర మంద గనకఖలము, లేక హరిద్వార[illegible] దల్లిచేయిఁ

బట్టుకొని లాగుచు, 'కాదే. ఇది యెంత బాగుగ నున్నదో చూడు' మని నుడివి పరుగిడి యాటగదిలోని కేఁగి యచ్చట వరుసగ బల్లమీఁదఁ బెట్టియున్న విలువగల వస్తువులఁ బాఱవైచి, యాస్థానమందు తా నేరికొని వచ్చిన రాళ్లను బెట్టి చప్పట్లు జఱచుచు కూను రాగములఁ దీయుచుఁ బరమానందమును బొందుచుండెను.

మఱియొక బాలిక తనబొమ్మలను వరుస పేర్లుబెట్టి పిలిచి మాట్లాడుచు నం దొకబొమ్మను జూచి దానియొద్దనుంచిన రాయిని బట్టుకొని 'ఇది బాగుంది; అట్లాంటివి యింకా రేపు తెచ్చిపెడతానులే.' అనియు నింకొక బొమ్మవంకఁ దిరిగి కరుణరస ముట్టిపడ 'అమ్మా! నీ కిది కావలెనా! రేపు తెచ్చిపెడతాలే. ఏడుంవకు' అనియుఁ గొన్ని బొమ్మల సంతోషము నకు సంతసించుచు, మఱికొన్ని బొమ్మల యే

డ్డులకు విచారించుచు, అప్పుడే యొకబొమ్మ కోరిక నీడేర్చుటకు మఱియొక బాలికను జూచి 'ఓసే అక్కా! నాకొక పచ్చరాయి యియ్యవే. నా అమ్మాయి యేడుస్తున్నదీ! మళ్లీ రేపు యిస్తాను.' అని యడుగ నాబాలిక 'ఉఁ - నే నియ్యను. ఇస్తే నాపాపాయి యేడ్వదూ' అని నుడివెను. అంత నాబాలిక మూతి బిగించుకొని మహాగంభీరముగ నిమేషముండి చివ్వనలేచి పరుగిడి తల్లిని గౌఁగిలించుకొని యటునిటు కదలనియ్యక, ఆమె నేత్రయుగళమునుండి ప్రవహించు వాత్సల్యామృతధారలను బానముఁ జేయుచుఁ గండ్లు ద్రిప్పుచు, తడఁబడుమాటల 'అమ్మా! అమ్మా! పచ్చరాయి యియ్యమన్నానే. అది యియ్యనన్నాదే. ఆఁ ఆఁ! నాకు ఇప్పించవూ! అమ్మా!' అని కొంగునడ్డుకొని లాగుచుండఁ బ్రసూతి యాబాలికను జంకనెత్తుకొని చెక్కిలినొక్కి

ముద్దాడి 'వెఱ్ఱిదానా! రాయి యెందుకే? అంతకంటె మంచిరాయి యిస్తాను చూడు.' అని యొక పచ్చ నిచ్చెను. కాని యీబాలిక దాని నటు నిటుఁ జూచి క్రిందఁ బడవైచి 'అమ్మా! ఇది కాదే. అక్క దగ్గర నున్నదే అది.' అని నుడువుచుండఁ బ్రసూతి పుత్త్రికల కడ కేగి వారిబొమ్మలపెండ్లిండ్లు - విందులు - శయనగృహములు - పాన్పులు - వస్తువాహనములు - బొమ్మలఁ గాంచి, వారి ముసిముసినగవులు - ప్రసంగములు - మొదలగువానిని జూచినకొలఁదిని నామె వాత్సల్య రసము నూతనాకారమును దాల్చి వెల్లివిరియు చుండెను.

రాజమహిషి యానందము - ప్రేమపూరితమగు నామెదృక్కులు - అమృతమయమగు నావాక్కులు - ఆబాలికల వచ్చి రానితియ్యనిపలుకులు - అస్ఫుటధ్వనులు - నగము

మ్రింగి మాట్లాడు వాక్య విన్యాసములు, ప్రశాంతమగు నాచూపులు - సంతోషములు - దీనాలాపములు - ఆటపాటలు - కోపతాపములు - బొమ్మలకు పాలిచ్చునప్పుడు తమ్మితరులు చూచుచున్నారని సిగ్గులు, - చిఱునగవులు - వెక్కిరింపులు - మొదలగు దృశ్యములను వర్ణించుటెట్లు? ఆవిషయము సంతానవంతు లగు తలిదండ్రులకే తెలియవలెను. చైతన్యము వెల్లివిరియుచుండు బాలికలకే యెఱుక పడవలయును. కాని యొక్కటి యున్నది. తల్లులు పిల్లల నారాధించుచుందురు. పిల్లలు బొమ్మల సేవించుచుందురు. ఏలయన, తల్లులు మాతృత్వముయొక్క విశ్వజనీనావస్థను పిల్లలయం దుపలబ్ధినొంది దాని నారాధించెదరు. ఆస్వాదించెదరు. తన్మయత్వము నొందెదరు. బొమ్మలకును తల్లులకును మధ్యనుండు స్థానము పిల్లలది. అక్కడ వారి

మొదటి ప్రకరణము ౯

నూతన సార్వజనిక మాతృత్వము పొంగి పొరలు చుండును. ముకుళించు కొనుచుండును. మఱునిముసమునఁ దరంగతాడిత మగు మహాప్రవాహసదృశ మగు చుండును. అప్పు డది హద్దులను గమనింపదు గదా!

---

## రెండవ ప్రకరణము

దక్షుని పుత్రిక లందఱిలోను సతీదేవి చిన్నది. అందువలనఁ దలిదండ్రు లామెయం దెక్కుడుప్రీతి గలిగి యుండుట సహజమే గదా. ప్రసూతి సతిని గాంచక యరనిముసమైన నుండఁ జాలకుండెను. దక్షుఁడు రాజ్య భారమును మంత్రులపై నునిచి యెల్లప్పుడు సతితోడనే కాలము గడపుచుండెను. ఆరాజదంపతు లప్పుడు సతీదేవియొక్క మూర్తీభవించిన మాతృభావమును గాంచి, యామె తమపుత్రిక యనుజ్ఞానమును మఱచి, తా మామెసంతాన మని తలంచి సేవించుచుండిరి. అందువలన నాదంపతుల నోట 'అమ్మా' యనుమాట తప్ప మఱి వేఱుమాట రాకుండెను.

సతి కిశోరవయసునందుండి ముగ్ధత్వము నకుఁ దార్పంబడెను. ఆ వయసునందలి ధీర తయు, లజ్జయు, సతిని మఱింత సుందరవతిగ నొనర్చుచుండెను. సతి రూప గుణములయం దసమానురాలు. కాని, యామె సౌందర్యము శరీరచ్ఛాయనుబట్టి గాని, ముక్కు చెవులు మొదలగు వాని పొందిక ననుసరించి గాని, యుండలేదు. సతీ సౌందర్య మామె నాశ్ర యించి వెలుంగు ప్రకాశమం దుండెను. ఆమె మాతృభావమం దుండెను. అందువలన నామెను గాంచిన వారెల్లరు ముగ్ధులగు చుండిరి. సన్న్యాసులు మొదలగువా రామెను జూచినంతనే జగన్మాత యని తలఁచి మనము నందు వందనము లర్పించుచుండిరి.

ఈమె గురుజనుల సేవింపుచు, కోపతాప ము లెఱుంగక పరమానందమున మెలంగు చుండెను. దాసీదాసులు బంధువులు మొద

లగు వారిమీఁదఁ గాని, జరాజీర్ణులు, రోగులు మొదలగువారిపైఁ గాని యెప్పుడును కరుణను జూపి - కాదు - ప్రేమనే ప్రవహింపఁ జేయుచుండెను.

అందువలన నీమె నెల్లరు "ప్రేమామయీ." యని పిలుచుచుండిరి. దక్షుని పుత్త్రికలలో సతికిని మిగిలినవారికిని స్వభావమున మిక్కిలి భేద ముండెను. వారందఱు వెలగల వసనభూషణములయం దెక్కు డనురాగమును గలిగియుండిరి. కాని, సతి వస్త్రాభరణములవంకఁ గన్నెత్తి చూచియైన నెఱుఁగదు. వారిలో గొందఱు, ఇంద్రధనుస్సువంటి పలువన్నియల వస్త్రములను, మఱికొందఱు, ఆకుపచ్చ, పసుపు, నీలము, మొదలగు దుకూలములను బ్రేమించుచుండిరి. కాని సతికిఁ గాషాయవస్త్రములు మిక్కిలి ప్రీతి గొలుపు చుండెను. వారి కంఠములయందు మణిమయ

హారములును, ముత్యాలసరములును, చేతులకు నవరత్న స్థగితమగు కంకణములును ప్రకాశించుచుండెను. ఈమె కంఠమందు స్ఫటికపుఁ బూసలును, హస్తములకు రుద్రాక్ష వలయములుండెను. వారు మంచిగంధము. పునుగు జవ్వాజి మొదలగు పరిమళ ద్రవ్యములను శరీరమం దలందుకొనుచుండిరి. ఈమె శరీరమంతటను విభూతిఁ బూసికొనుచుండెను. దాసీ లీమెతల నెంతో ప్రయత్నముతోడ దువ్వి ముడివైచినను, అప్రయత్నముగ నా ముడి వీడి క్రిందికి జాఱుచుండెను. మఱియు జడలుగట్టుచుండెను. ప్రసూతి పుత్రిక వేషమును గాంచి మిక్కిలి చింతింపుచుండె నని చెప్పుటయం దాశ్చర్య మే మున్నది! వసన భూషణధారణముననుు, శరీరపోషణయందును నుదాసీనభావము గల ముగ్ధత్వమందలి పుత్రికను గాంచి యేతల్లి సహించి యుండఁగలదు?

అప్పుడప్పుడామె సతిని జూచి యిట్లను చుండె. ‘‘అమ్మా! నీ కేమికాదువ? పెద్దదాన వగుచున్నావు గదా! ఈ పిచ్చి వేష మేమి? మంచిమంచి వస్త్రములఁ గట్టుకొనరాదా? విలువ గల భూషణముల ధరింప రాదా! చక్కఁగాఁ దలముడుచుకొనరాదా! నీ యా కారమును జూచినవా రేమందురు? ‘పిచ్చిది. వెఱ్ఱిది. అది యనరా? ని న్నెవ్వరు పెండ్లి యాడుదు రమ్మా!’’

తల్లి మాటలకు నవ్వుచు సతీదేవి యిట్లను చుండె. ‘అమ్మా! బాగుగ నున్నది. ఎప్పుడు నీ యొద్దనే యుందును.’ అని నుడువుచు నామెను కౌఁగిలించుకొను చుండెను. దక్షుఁడు కూడఁ గుమార్తె వేషమును గాంచి విచారపడుచుం డెను. కాని యాయన, ఆ ప్రేమామూర్తిని, ఆ యానందరాశిని, ఆజగన్మాతృ స్వరూపిణిని, గాంచి యేమియుఁ బలుకఁజాలకుండెను. సతీ

మనంబున కేమాత్రము నొప్పిగలిగినను గూడ నామె కలువరేకులవంటి కన్నులనుండి జలజలమని యశ్రుబిందువులు స్రవించుచుండెను. అందువలన దత్తుఁ 'డీ పిచ్చిదానికి భర్తగూడ పిచ్చివాఁడు లభింపకుండుఁ గాత' యని యీశ్వరుని బ్రార్థించుచుండెను.

---

## మూఁడవ ప్రకరణము

సతీదేవికిఁ బదునాలుగు వత్సరము లయి నంతనే యొకయోగిని వచ్చి దక్షుని గృహమున నివసించుచు, ప్రసూతిని 'అమ్మా' యని పిలుచుచు, సతిని మిక్కిలి ప్రేమించుచుం డెను. సతి యోగినిని 'అక్కా' యని కాక మరి వేఱువిధమున సంబోధించి యెఱుంగదు. సతి యోగిని పదాంకముల ననుసరించి ప్రవర్తించుచుండెను. ఆమెశిక్షవలనను, సహవాసము వలనను, సతీ విశ్వజనీన మాతృత్వము వికసింపసాగెను.

యోగిని బిల్వ వృక్ష మూలమందుఁ గూర్చుండి 'హర హర' అని శివుని నారాధించునప్పుడు సతి యానంద మొందుచు, తాను

గూడ 'హర హర' అని నుడువుచుండెను. యోగినితోడ శివస్తోత్రమును బఠింపుచు, పరమానంద భరితయై తన్మయత్వము నొందు చుండెను. మఱియు శివతత్త్వమును గ్రహించుటకుఁ బ్రాణపణముగఁ బ్రయత్నించుచుండెను. అప్పుడు యోగిని శివతత్త్వమునుగూర్చి చెప్పుచుండ సతీదేవి యా విషయమును వినుచు, 'హర హర.' యని నుడువుచు మ్మై మఱచుచుండెను.

ఒక దినమున యోగిని సతిని జూచి యిట్లు సెప్పఁదొడంగె. "అమ్మా; సతీ! శివుఁ డనాది దేవుఁడు. దేవతలందఱిలో శ్రేష్ఠుఁడు. అందు వలన 'దేవాది దేవ, మహాదేవ' యను నామములు లభించినవి. ఆయన మంగళ మయుఁడు. ఎప్పుడును జగత్కళ్యాణము కొఱకుఁ బ్రయత్నింపుచుండును. కావున 'శివ' అను నామము లభించినది. ఆతఁడు, సమస్త

మును మఱచి యెల్లప్పుడు యోగమందుండును. కాఁబట్టి యోగీశ్వరేశ్వరుఁ డనుపేరు వచ్చినది. ఆహా! ఆ నామధేయ మెంత మధురమైనది. ఆ మహానుభావుఁడు రాగ ద్వేషరహితుఁడు గదా! దేవతలకు స్వర్గమొసంగి తాను శ్మశానము నాశ్రయించెను. వారి కమృత మొసంగి, తాను విషమును గ్రోలెను. అందువలన వా రమరులైరి. ఆతఁడు నీలకంఠుఁడాయెను. ఆ మహాపురుషుఁడు స్వసుఖమునుగూర్చి యణుమాత్ర మైనను యోచించుకొనఁడు. ఎప్పుడును పరులకు మంగళములను గూర్చుచుండును. ఆహా! అట్టి పరోపకారశీలు రెవ్వరున్నారు?''

యోగిని యుపదేశ వాక్యములు వినిన కొలఁదిని సతీదేవి నేత్రములు వారి పూరితములై వ్యాకుల హృదయమున యోగినిని జూచి యిట్లనియె. "అక్కా! ఆయనకుఁ జుట్ట

పక్షము లెవ్వారు లేరుగదా! ఎప్పుడు శ్మశాన మందే నివసించుట యెంత కష్టము? నాలుక యీడ్చుకొని పోవుచున్నప్పుడు, గ్రుక్కెఁడు నీళ్లిచ్చువారు గాని, కడుపు కాలుచున్నప్పుడు పిడికెఁ డన్నముఁ బెట్టువారు గాని, ఎండ వానలకు తలఁదాఁచుకొనుటకుఁ జిన్నకుటీరమైనను లేదు గదా? అయ్యో! పాపము! ఆయన యెట్టి కష్టము లొందుచుండును? కాని మన కాయన దర్శనము లభించదాయె. అక్కా! నా కీమాట చెప్పు. నే నా మహానుభావుని నెట్లు చూడఁగలను? ఈ పుష్పహార మాయన కంఠమం దలంకరించి శుశ్రూషఁ జేయవలయు నని నా మనము తొందరపడుచున్నది. అక్కా! నా కోరిక నీడేర్పవు? ఆ శ్మశానవాసి యగు సన్యాసిని గృహస్థునిగఁ జేయుదము."

యోగిని:- అమ్మా? శివుని యందు నీకుఁ గల యనురాగము నిరుపమానము.

అందువలన నాతఁడు నీకు శీఘ్రముగ దర్శన మిచ్చును. కావున నీ వాయనను బూజింపుము. ధ్యాన ధారణ లొనర్పుము. అప్పుడు నీ కాయన ప్రత్యక్ష మగును.

సతి:- అక్కా! ఆయన యెచ్చట నుండును? ఎక్కడ కేగిన నాయనను జూడవచ్చును? ఇఁక నే నాయనను దర్శించక యుండఁ జాలను.

యోగిని:- అమ్మా! నీవు పసిదానవు. తొందర పడుటవలనఁ బ్రయోజనము లేదు. స్థిర చిత్తమున నా జటాజూటు ధ్యానింపుము. అప్పు డాయన నీకు దర్శన మొసంగును. ఆ మహా పురుషుని జూచుటకు నీ వింకొక చోటున కేగవలసినపని లేదు. ఆతఁడు సర్వత్ర నిండియున్నాఁడు.

అని నుడివి యోగిని సతీదేవిచేత యోగాభ్యాసము సేయింపసాఁగెను. సతి క్రమ

ముగా యోగాసనమం దుండి శివుని నారాధించుటకు నభ్యసించెను. సతి యనుదినమును, యోగమందుండి యేకాగ్ర చిత్తమున, 'ప్రభో! దేవాదిదేవా! మహాదేవా! దర్శన మొసంగి నన్నుఁ గృతార్థురాలనుగ నొనర్పుము. నేనొసంగు నీ పుష్పహారమును గైకొనుము.' అని ధ్యానించుచుండెను. పరమేశ్వరుఁడు భక్త కల్పతరువు. కావున భక్తుల ప్రార్థనను వినుచు నూరకుండఁ గలఁడా! కావున శివుఁడు ప్రత్యక్షమై 'సతీ! పుష్పమాల నొసంగుము.' అని నుడివెను. అంత నామె యాతని కంఠమందుఁ బుష్పహారము నిడి ఱెప్ప వాల్పక చూచుచు, రజతగిరి సన్నిభుండగు నా మహాదేవుని పాదపద్మములయం దాత్మను సమర్పించి ముద్దరాలయ్యెను. మహాదేవుఁడు, సతీదేవి మనఃప్రాణములఁ గైకొని యదృశ్యుఁడాయెను.

అప్పుడు సతి హృదయము శూన్య మాయెను- యోగభంగము గలిగెను - అంధ కారము గప్పెను - మూర్ఛిల్లెను. అప్పుడు యోగినీ ప్రయత్నము వలన సతికి బాహ్య జ్ఞానము గలిగెను- కాని శాంతి మాత్రము గలుగలేదు- ఎచ్చటనో సూచుచుండెను. శరీ రము కంపించుచుండెను - కన్నీరు కాల్వలై ప్రవహింపసాగెను.

యోగిని సతిహస్తము బట్టుకొని యామెను వేఱువిషయములోనికి దింపి ప్రసూతి కడకుఁ దీసికొని యేగెను.

---

# నాలుగవ ప్రకరణము

దక్షప్రజాపతి పుత్రిక లందఱకు వివాహ మయ్యెను. వారంద ఱత్తవారిండ్లకేగి సుఖ ముగఁ గాపురములఁ జేయుచుండిరి. సతి యందఱకంటెను జిన్నది. ఆమెకు మాత్ర ము వివాహము కాలేదు.

ఇప్పుడు సతీదేవి వివాహ యోగ్య యయ్యెను. ఆమెను దగినవరున కిచ్చి మహా వైభవముతోడ వివాహముఁ జేయవలయునని రాజదంపతు లువ్విళ్ళూరుచుండిరి. ఒకదిన మున వరాన్వేషణమున కేగిన నారదుఁడు వచ్చి దక్షప్రజాపతికి నమస్కరించి యిట్ల నియె. మన సతీదేవికిఁ దగినవరుని గుదిర్చితిని. అట్టివాఁడు భూమండలమందు మఱిలేఁడు.

దక్షుఁడు:- వత్సా! నారద! ఆతనిపే రేమి? నివాసస్థల మెచ్చట?

నారదుఁడు:- ఆతఁడు కైలాసపురాధీశ్వరుఁడు.

ఈ మాట వినినంతనే దక్షుని మోము కొంచెము చిన్నవోయి యేదియో ప్రశ్నించఁ బోవు నంతలో రాజమహిషి యిట్లనియె. ''కైలాసపురమా! అది చాలదూరము. అంత దూర మిచ్చినయెడల సతీసమాచార మెప్పటి కప్పుడు నాకుఁ దెలియుటకు వలనుగాదు. అది నాకుఁ బ్రతిదినము గనుపడునట్టు లుండవల యును.''

నారదుఁడు:- రాణీ! దూరమైన నేమి? నీకేమి కొదువ? సతీయోగక్షేమ మెప్పటి దప్పుడు కనుఁగొనుటకు నీకు మనుష్యులు లేరా? వాహనములు తక్కువా? కాని సతి యెల్లప్పుడు నీకుఁ గనఁబడుచుండుట ముఖ్యమా? దానికి

మంచి సంబంధము దొరకుట ముఖ్యమా? అది సౌఖ్యముగఁ గాపురము సేయుచుండిన యెడల దానిని నీవు చూడకుండిన మాత్రమునఁ గలుగు నష్టమేమి?

దక్షుఁడును, ప్రసూతియు యోచించుకొని నారదుఁడు సెప్పినమాటలు బాగుగ నున్నవని తలఁచి దూరమైనను కైలాసనాథున కిచ్చి సతికి వివాహము సేయవచ్చు ననుకొని దక్షుఁ డిట్లనియె:-

'వత్సా ! నారద ! ఆతఁడు విద్వాంసుఁ డౌనా?'

నారదుఁడు:- ఆయన సర్వవిద్యాపారంగతుఁడు. వసిష్ఠ మహర్షిని మీ రెఱింగియె యున్నారు గదా; ఆతఁడు కైలాసనాథుని యొద్దనే, ఋగ్యజుస్సామముల నభ్యసించెను. మహాపరాక్రమసంపన్నుఁడగు పరశురాముఁ డాయనకడనే యథర్వణ వేదమును జదువు

కొనెను. నా కాయనయే గాంధర్వవిద్యా శిక్ష నొసంగెను.

అను వాక్యములు వినుచు సంతోషించుచు దక్షుఁ డిట్లనియె:- కాని నారదా? ఆతఁడు భుజబలసంపన్నుఁ డౌనా?

నారదుఁడు:- అయన ధరించు ధనుస్సును బినాకమందురు. అ పినాకమందు బాణము సంధించుమాట యటులుంపుఁడు. దాని నెత్తఁ గలవాఁడైనను భూమండలమందు మఱిలేఁడు. ఆవింటితోనేగదా కైలాసనాథుఁడు త్రిపురాసురుల సంహరించినది.

రాజమహిషి:- నారదా! ఆయన సుందరాకారుఁ డౌనా?

నారదుఁడు:- రాణీ! ఆవిషయమునుగూర్చి యేమి చెప్పుదును? ఆయన దృఢోన్నతగాత్రుఁడు. బాహువు లాజానులంబకములు. ఆకర్ణాంతములు లోచనములు. రజితగౌరము

వర్ణము. సర్వదా ప్రసన్నవదనము. అట్టి సౌందర్యవంతుని నే నెక్కడను జూడలేదు. మఱి చూడఁ బోను. ఆయనయంకమందు మన సతి యుండుట కర్హ్వరాలు.

రాజమహిషి:- ధనవంతుఁడౌనా?

నారదుఁడు:- రత్నగర్భ యగు కైలాస రాజ్యమున కాతఁడు రాజు. యక్షరాజగు కుబేరుఁ డాయన ధనాగారమున నధిపతి. ఇఁక ధనమున కేమిలోపము? ఐశ్వర్యమున కేమి కొఱంత?

ఈ విషయమం దింతకంటెఁ బ్రసూతికిఁ జెప్ప నావశ్యము గాదు. ఏల యన, రత్నముల యం దత్యంత ప్రీతి గల రాణి కుబేరుని నామధేయ మెఱుంగదా? అందువలన నామె మిక్కిలి సంతసించి తిరిగి యిట్లనియె? 'ఆయనకు తలిదండ్రులు మొదలగువారున్నారా?'

నారదుఁడు చిఱునవ్వు నవ్వుచు నిట్లనియె! ఆయనకుఁ దలిదండ్రులవంకవా రెవ్వరును లేరు. అది యొకలోపమే. కాని వివాహమైనంతనే మన సతి కైలాసమునకు సర్వేశ్వరి యగును.

ఈ మాటలకుఁ బ్రత్యుత్తరం బొసంగక రాజమహిషి మౌనమును ధరించి చూచుచుండ నారదుఁ డిట్లు సెప్పందొడంగెను. 'రాణీ! ఇంకను నే నొకటి రెండు సంగతులు సెప్ప వలసియున్నది. అవి యిప్పుడే సెప్పుట యుత్తమము. వాని మంచిచెడుగులను మీరే యోచింపుకొనుఁడు. తర్వాత నన్ను నిందించినఁ బ్రయోజనము లేదు. కైలాసపతి సంసార సంబంధమునందు సంపూర్ణముగ నుదాసీనుఁడు. ఆయనకు గృహము శ్మశానము. విభూతి మంచిగంధము. ఆయన యెప్పుడును యోచనానిమగ్నుఁడై యుండును. ఆ

నిమగ్నత జగత్కల్యాణముకొఱకుఁ గాని స్వసుఖముకొఱకుఁ గాదు. ఆయన శ్మశానముల యందలి శవములను బరీక్షించుచు, అరణ్యములయందలి వృక్షముల గుణాగుణములను విచారించుచు, గిరిగహ్వరముల కేగి యోగతత్త్వమును నిరూపించుటతోడఁ గాలము గడపుచుండును. తత్త్వనిరూపణకొఱకాయన కాలకూటమును ద్రాగుటకుఁ గాని, ఘోరవిష సర్పముల ధరించుటకుఁ గాని వెనుదీయఁడు. ఇందువలన నీయన సంసారియైనను సన్యాసి. మహారాజైనను భిక్షుకుఁడు. రాణీ! వరుని గుణాగుణములఁగూర్చి యున్నదున్నట్లు సెప్పితిని. తర్వాత మీ యిష్టము.'

నారదుని వాక్యములు విని ప్రసూతి మౌనమును ధరించియుండ నొక ప్రవీణురాలగు దాసి ప్రసూతిని జూచి యిట్లనియె. అమ్మా! మీ రేల యోచించెదరు? తలిదం,

త్రులు లేనివారికి మనస్సిమితము కొంచెము తక్కువగ నుండును. అందువలన వారు చెట్టు పుట్టలు పట్టి తిరుగుచుందురు. కాని మన సతి తెలివి కలదైనచో, కైలాసనాథుని నీ యిష్టము వచ్చినటు లొక్క నెలలో నడి పింపదా?”

ఈ మాటలకు రాణి సంతృప్తిపొంది “సర్వ గుణసంపన్నుఁడగువాఁ డెచ్చట నుండును? దాసీ! తగిన సంబంధముఁ గూర్చుట మా పనిగదా! తర్వాత దానియదృష్టము. కావున రూపగుణైశ్వర్యములయం దసమానుఁడగు కైలాసనాథుని హస్తములలో సతిని బెట్టుట యుత్తమము. కాని మహారాజుగారి యభి ప్రాయ మేమో?” అని దక్షప్రజాపతి వంకఁ జూచెను.

దక్షుఁడు:- రాణీ! నా సతిప్రాలు దుడుచు టకేరితరము? ఈ పిచ్చిది యే పిచ్చివానిచేతి

యందుఁ బడునో యని మొదటనుండియు నేను భయపడుచుంటిని. ఇప్పుడు నే ననుకొనినట్లే యైనది. ఏమయినఁ గాని, నేను గూడ సమ్మతించుచున్నాను.

తథాస్తు. సతిని కైలాసనాథున కిచ్చి వివాహ మొనర్చుట నిశ్చయము.

అప్పటినుండియు రాజదంపతులు వివాహ ప్రయత్నములు సేయసాగిరి.

---

# ఐదవ ప్రకరణము

సతీదేవి వివాహమునకు దక్షుని బంధువులు మొదలగువారు వచ్చిరి. రాజభవనము దీపమాలికలచేత దేదీప్యమాన మగుచుండెను. రాజపుత్రికలు సుందర వసనభూషణముల ధరించి యటునిటుఁ దిరుగుచుండిరి. వివాహమంటపమునకుఁ గైలాసనాథుఁడు వచ్చెను. ఆయనను గూర్చి నారదుఁడు సెప్పినవిషయమంతయు సప్రమాణ మయ్యెను. కైలాసనాథుని పూర్ణచంద్రునివంటి మోము జటాజాలములమధ్యఁ బ్రకాశింపఁజొచ్చెను. విభూతిలేపమువలన రజత గౌర శరీరము మఱింత శోభిల్లుచుండెను. కైలాసనాథుని జూచి రాజ

మహిషియుఁ దక్కం గలవారును ముగ్ధలైరి. పురాంగన లేకగ్రీవమున 'మనసతికిఁ దగిన వరుఁడు లభించె' నని పలుకసాగిరి. కాని యొకవిషయమందుమాత్రము రాణి మిక్కిలి విచారపడుచు, నిట్లు తలపోయఁ జొచ్చెను. 'కైలాసనాథుఁడు మహదైశ్వర్యవంతుఁ డని నారదుఁడు సెప్పెను గదా! ఆమాట లసత్యములా?' అని యనుకొనుచుఁ బురాంగనలఁ జూచి యిట్లనియె. 'అదేమి వేషమమ్మా! ఇది వివాహసమయము గదా! సతికిఁ గూడ నా రుద్రాక్షలు— ఆ విభూతి— ఆ చర్మాంబరములానా? ఒక్క మంచిదుకూలము గాని. యొక్క మంచినగ గాని, తీసికొని రాఁగూడదా? మహదైశ్వర్యాన్వితుండని నారదుఁడు సెప్పెను. ఐశ్వర్య మటుంపుఁడు. సన్యాసివలె నున్నాఁడు. నారదుఁ డసత్యములాడునా? ఆతడు. కాని యాయనకు సంగతి సందర్భములు

దెలియకుండవచ్చును...' అని యేమేమో చెప్పి విచారింపుచుండ నొక వృద్ధాంగన యిట్లనియె. 'అమ్మా! రాణీ! ఆయనకుఁ దలిదండ్రులు లేరు గదా! వివాహమున కలంకరించి పంపించువా రెవ్వరు? తనంతట తా నలంకరించుకొనిరాఁడు గదా! అందు వలన నాతనికాచారమైన వేషమున వచ్చి నాఁడు. తనకుఁ దోచినవి తెచ్చినాఁడు. ఇక్క డకుఁ దేకున్న నేమి? ఆయన యైశ్వర్య మంతయు మన సతిది కాదా?

మరియొక స్త్రీ యిట్లనియె:- మన సతి మిక్కిలి యదృష్టవంతురాలు. అందు కణు మాత్రమైనను సందియము లేదు. కాని మీది రాజసంసారము గదా! సతికి లోప మేమున్నదమ్మా! ఇట్టి బాలిక నొక్కఁడానినే కాదు. వేయిమంది నలంకరింపవలయు నని నను మీ కొక లెక్కయా?

కాని, యీ మాటలవలనఁ బ్రసూతి యూరడిల్లు టెట్లు? అమె నారదుని బిలిచి యిట్లనియె. 'నారదా! నీ వీయనను మహదైశ్వర్యాన్వితుఁడని చెప్పితివి. కాని చూచినవారెవ్వ రైశ్వర్యవంతుఁ డనుకొందురు? మిఁదుమిక్కిలి సన్యాసి యని తలఁచుట కేమైన సందియమా? చివరకుఁ బెండ్లికూతునకు రెండు కంకణములైనఁ దీసికొని రాఁగూడదా? ఆభరణములు రుద్రాక్షలా? నాపుత్రిక సన్న్యాసిని కాదే.'

నారదుఁడు:- రాణీ! నే నసత్యము లాడువాఁడనుగాను. సతి నిజముగ రాజరాజేశ్వరి యైనది. కాని యిప్పు డేమి చెప్పిన నేమి లాభము? కొంచె మోపికఁబట్టియుండుడు. అప్పుడు నేను సెప్పినదంతయు యథార్థ మగును. మన సతిని భర్తృగృహమున కేఁగనిమ్ము. నీ యల్లుని మహదైశ్వర్యమును గాంచెదవు.

ఈ వాక్యముల వలన రాణియు మిగిలిన వారును గొంతవఱకుఁ దృప్తినొందిరి. కాని, దక్షుఁడు, అల్లుని వేషభూషణములఁ గాంచియు, ఆయన యనుచరుల రూపురేఖావిలాసములఁ జూచియు, అసంతుష్టచిత్తుఁ డాయెను. ఆయన యల్లుండ్రలోఁ గొందఱు గుఱ్ఱముల నెక్కియు వచ్చియుండిరి. కాని యీ పెండ్లికొడు కొకపర్వతమువంటి వృషభము నెక్కి వచ్చెను. వారివెంట బంగారు వెండి కట్టులను బూని సుందర వేషములతోడ ననేకులు భటులు వచ్చియుండిరి. ఈ పెండ్లివారియాకార వికారములఁ గాంచి కనకఖలవాసు లాశ్చర్యమును బొందుచు, 'ఈతఁ డెక్కడిరాజురా' యని కొందఱు హేళనముసేయుచుండ మఱి కొందఱు వృద్ధులు 'కొండతేఁడు లిటులే యుందురు' అని ప్రత్యుత్తరం బొసంగుచుండిరి. కాని, కైలాసనాథుని సదానందమగు మో

మును, చిరప్రసన్నమగు మూ_ర్తిని, గాంచిన కొలందిని, పురవాసుల భావఃములు మాఱి పోయి యాయనయందు భ_క్తిగలుగుచుండెను.

సతియొక్క యానందమును వర్ణించుటెట్లు, సాధులవలన సన్న్యాసులవలన, నెవరి చరిత్రను విని పరవశ యగుచుండెనో, ఎవరిని హృదయ పీఠమం దుంచుకొని యనునిమేషమును బూ జించుచుండెనో, అట్టి కైలాసనాథుఁ డామెకుఁ బ్రత్యక్షముగఁ బతిరూపమునఁ బార్శ్వమం దున్నప్పుడు, ఆమె సంతసమునకు మేర యుం డునా? సతి యింతకుఁ బూర్వమే కైలాస నాథుని పాదపద్మములయం దాత్మను సమ ర్పించి యుండెను. చంద్రమండలమును ధిక్క రించు నామోము, రజతగిరినిభ మగు నా శరీరము, యాజానులంబనములగు నా బాహు వులు, ఆ విశాల వక్షస్స్థలము, నిందితారవిం దములగు నాచరణములు కాంచినంతనే యా

మె కైలాసపతి నుద్దేశించి మనంబునం దిట్లు ప్రణామం బాచరించెను. 'ప్రభో! కైలాస నాథా! తమరే సతికి ప్రభువులు. తమకొఱకే సతి జన్మించినది. తమ కృపయుక్తమగు సహ ధర్మిణి యగునటులు విధాత నన్ననుగ్రహించు ను గాత!'

వివాహానంతరము సతీదేవి కైలాసధామ మున కేఁగెను. ఈమె రాకవలనఁ గైలాస మపూర్వశ్రీని ధరించెను. కుసుమములయం దధిక సౌరభమును, విహంగ కూజితము లయం దెక్కుడు మాధుర్యమును, గనుపట్ట సాగెను. సన్న్యాసియగు కైలాసపతి సతిని వివాహమాడి సంసారి యయ్యెను. ప్రతి విషయమందునను సతీదేవి పతికి యర్ధాం గియై యలరారుచుండెను.

---

## ఆఱవ ప్రకరణము

ఋతురాజగు వసంతుని సమాగమము వలనఁ గైలాస మపూర్వ శోభావికాసము నొందెను. పత్రపుష్పవిహీనములగుతరులతలు నవకిసలయముతోడ సుశోభితములై యల రారుచుండెను. గిరివరము శుభ్రతుషార వస్త్రమును వీడి శ్యామవర్ణ రంజితమగు దువ్వలువను ధరించెను. వివిధవర్ణములతోఁ గూడిన పుష్పగుచ్ఛములు, గిరిరాజు శరీరమంతటఁ బ్రకాశింపఁజొచ్చెను. మంచుగడ్డలు గఱిగి వందలకొలఁది సెలయేళ్లై ఝరఝర నినాదమునఁ గ్రిందికిఁ బ్రవహించుచుండెను. శీతమునకు భీతిల్లి యుష్ణప్రదేశముల నాశ్రయించిన జీవజంతువులు తిరిగి వచ్చుటవలనఁ గైలాస

పర్వతము సజీవ మయ్యెను. కైలాసోప వనముల యందు, భ్రమర ఝుంకారములును, కోకిల కూజితములును, శుకపికనినాదములును, మాఱుమ్రోఁగుచుండెను. తరులతలు, పశుపక్షులు, మొదలగునవన్నియు, నూతన జీవనధారణం బొనర్చి నవస్ఫూర్తితోడ విలసిల్లుచుండెను.

కైలాసపర్వతోన్నత శిఖరము మీఁద మహాదేవుని శుభ్రస్ఫటికనిర్మితం బగుమందిరం బుండెను. గొప్పగొప్ప దేవదారు వృక్షములామందిరమునుజుట్టి దానిని మఱుగు పఱచుచుండెను. అచ్చటి ప్రదేశమంతయు నెటుఁ జూచినను, స్నిగ్ధముగను, ప్రశాంతముగను, రమణీయముగ నుండి, తపోవన గాంభీర్యముతోడి, నుపవన సౌందర్యము మిళితమగుటవలన, నది తపస్సునకు, సుఖభోగమునకు ననుకూలముగ నుండెను.

ఆ ప్రాసాదమున కనతిదూరమందుఁ బ్రాచీన దేవదారువృక్ష మొక్కటి విరాజిల్లు చుండెను. అది శాఖా ప్రశాఖలతోడ నా కాశము నంటుచు, మిక్కిలి విశాలమై యుం డెను. దానిక్రింద నొకదినము సాయంత నము వేళ మహాదేవుఁడును సతీదేవియుఁ గూ ర్చుండియుండిరి. అక్కడ నొక వనలత దేవ దారు వృక్షము నాశ్రయించి ప్రాకుచుండెను. మంద సమీరణ మా దేవదంపతులను బుష్ప ములతోడఁ బూజింపుచుండెను. కైలాసపతి మస్తకమందు జటాజాలములును, కంఠమున రుద్రాక్షమాలలును, శరీరమందంతట విభూతి లేపనము, కటిదేశమందు వ్యాఘ్ర చర్మము, భాసిల్లుచుండెను. సతీ వేషభూషణములు పతి కనుకూలముగనే యుండెను. ఆమె కాషాయ వస్త్రమును గట్టుకొని కంఠమున రుద్రాక్ష మాలలును, కరముల రుద్రాక్ష వలయము

లును, ధరించియుండెను. కేశపాశము కటి ప్రదేశమాక్రమించి, శిలాతలమందు జీరాడుచుండెను. ఈదంపతుల కెదురుగా నంది త్రిశూలమును ధరించి నిలుచుండియుండెను. అస్తమితభానుని యరుణకిరణములా దేవదంపతులమీఁదఁ బడుటవలన వారి మోములు దేదీప్యమానముగ వెలుంగుచుండఁ గైలాసనాథుఁడు జీవుల సుఖదుఃఖములనుగూర్చి సతితోడ సంభాషించుచుండెను. ఆ సంభాషణను, తరులతలును, పశుపక్షులును నిశ్శబ్దముగ నుండి వినుచుండెను. కైలాసనాథుఁడస్తమించుచున్న సూర్యుని జూపెడి వ్రేలితోఁ జూపుచు సతీదేవి కిట్లనియె. 'దేవీ! ఇటుఁ జూడుము. జగత్తునంతయుఁ బ్రకాశవంతముగ జేసిన సూర్యుని తేజస్సెవిధముగఁ దరిగిపోవుచున్నదో కాంచుము. ఇఁక రెండుమూఁడు నిమిషములలో సూర్యుఁడు తేజోవిహీనుఁడై

మన కదృశ్యుఁడగును. మానవజీవితముగూడ నదేవిధముసుమా! కాని, మానవుఁడు క్షణ స్థాయినులగు సుఖదుఃఖములను శాశ్వతము లని తలంచుచుండును.'

సతి:- ప్రభో! సూర్యునకువలె మానవునకుఁ గూడ నుదయాస్తమానములు గలవా?

కైలాసనాథుఁడు:- లేకేమి? జన్మమృత్యువు లుదయాస్తమానములు గావా? ఉదయాస్తమానములవలన సూర్యుని తేజస్సునం దేవిధమగు మార్పు గలుగదు. కాని మానవజీవిత మట్లు గాదు. మానవుఁడు ప్రతిజన్మమందును, జ్ఞానోన్నతిని బొందుచుండును. కేవలము ధర్మహీనులగువారు మాత్రమేయధోగతుల నొందెదరు.

సతి:- అధర్మముగఁ బ్రవర్తించువా రెప్పుడును, అధోగతి పాలుకావలసినదే?

కైలాసనాథుఁడు:- అట్లనుటకు వలను గాదు. జీవునకు శివునకు భేదములేదు. సత్కర్మానుష్ఠానమువలన జీవుఁడు పాసవిముక్తుఁడై యనంతోన్నతిని బొందును. లేక శివత్వము నొందును.

ఇట్లు సంభాషించుకొనుచుండ దూరము నుండి వీణారవము వారి వీనులకు విందు గొలుపసాఁగెను. ఆగానము సతీదేవికిఁ జిరపరిచయమైనది. కాన వెంటనే యామె భర్తను జూచి ససంభ్రమముతోడ నారదుఁడు వచ్చుచున్నాఁడని నుడివెను.

ఇట్లనుకొనుచుండునంతలో దివ్యతేజోమయమూర్తియగు నారదుఁడు, వీణా సంయోగమున హరినామమును గీర్తింపుచు, వారిసమ్ముఖమునకు వచ్చి యేకాసనముమీఁదఁ గూర్చున్న సతీ కైలాసనాథులఁ జూచి చరితార్థుఁడాయెను. అప్పుడు వారి గుణగానముచేయ

నారంభించెను. ఆగానమువలనఁ గైలాస మందలి చరాచరములన్నియుఁ బరవశము లయ్యెను. వీరు పరస్పరము ప్రేమాలింగ నము లొనర్చుకొని నారదు నుచితాసనా సీనుం జేసిరి. పిమ్మట సతి యిట్లనియె:- దేవర్షీ! కనక ఖలవార్తలేమి? నా తలిదండ్రులు క్షేమ ముగ నున్నారా? నా తోఁబుట్టువులకు క్షేమ మా? దాసీదాసజనములు పౌరులు మొద లగు వారందఱుఁ గుశలమా?

నారదుఁడు:- అమ్మా! అందఱు క్షేమము. నీ తలిదండ్రులు మొదలగు వారందఱు కుశల ముగ నున్నారు.

సతి:- నన్నొకమాఱైనను మానాయన చూచి పోకుండుటకుఁ గారణ మేమి?

నారదుఁడు:-అమ్మా! సతీ! దక్షప్రజాపతి మిక్కిలి తొందర పనులయం దున్నాఁడు. ఆయన మహాయజ్ఞ మొకదానిని జేయఁదలఁచి

నాఁడు. అందువలన తీరిక లేకుండవచ్చును. భారతవర్షమందలి ధనికులు దరిద్రులు పండితులు, మూర్ఖులు, అను భేదము లేక యెల్లర నాహ్వానించుచున్నాఁడు. కాఁబట్టి నీక్షేమ సమాచారమును గనుగొనుట కాయనకు వ్యవధి లేదనుకొనుచున్నారు.

సతి యీ వాక్యములు విని పరమానంద భరితయై బాల్యస్మృతితోడ కనకఖలపట్టణమందలి తరులతా గుల్మములుగూడఁ బ్రత్యక్షమగుచుండ నిట్లనియె. 'దేవర్షి! నన్నుఁ దీసికొని పోవుటకే కదా మీరు వచ్చితిరి?'

నారదుఁడు:- అమ్మా! నేనిచ్చటకు వచ్చు సంగతి వారికిఁ దెలియదు. నిన్ను చూచి చాల దినములైనది. అందువలన నీమార్గమున నేఁగుచు నిటు వచ్చితిని.

సతి:- యజ్ఞమునకు మ మ్మేల పిలువ లేదు?

నారదుఁడు:- నే నేమి చెప్పుదు నమ్మా! నీ తండ్రికిఁ గొంచెముచిత్తచాంచల్యము గలిగినది. యజ్ఞమునకు మి మ్మాహ్వానించుఁడని విన్నాను.

ఈమాట విని నంతనే సతి యాశ్చర్య మొంది నిమేషకాలము మౌనమును ధరించి యుండి పిమ్మట నిట్టూర్పు విడుచుచు నిట్లనియె. 'దేవర్షీ! మే మొనర్చిన యపరాధ మేమి?'

నారదుఁడు:- కైలాసనాథుఁ డాయన నవ మాన పఱచినాఁడఁట. అందునకుఁ బ్రతీకార ముగ మి మ్మాయజ్ఞమునకుఁ బిలువఁ డని విన్నాను.

సతి:- అమ్మ కీసంగతి తెలియునా?

నారదుఁడు:- తెలియును. ఆమె మిమ్మా హ్వానింప వలయు నని యనేకవిధములఁ బ్రార్థించెను. కాని ప్రజాపతి యామె మొఱను చెవినిఁబెట్టలేదు. ఆమె యేమిచేయును? కా వున నన్నము నీరు ముట్టుకొనక యుపవసించు

చున్నది. అమ్మా! సతీ! ఇఁక నీ ప్రసంగము వలనఁ బ్రయోజనములేదు. నాకు వేఱుపని యున్నది. కావున నే నేఁగుచున్నాను.

అని నుడువుచు నారదుఁడు వెడలిపోయెను.

సతీదేవి కైలాసనాథుని జూచి యిట్లనియె. 'ప్రభో! మాతండ్రిని మీ రెప్పు డవమాన పఱచితిరి?'

కైలాసనాథుఁడు:- దేవీ! నే నాయన నవ మానపరచలేదు. ఆయన నే కాదు, ఎవరిని గూడ నవమానపఱచుట నాస్వభావము గాదు. కొలఁదికాలము క్రిందట దేవగణముతోడ నే నొక సభ కేగితిని. అప్పు డక్కడకు దక్ష ప్రజాపతి వచ్చెను. ఆయన వచ్చినంతనే సభా సదులెల్లరు నిలచి యాయనను గౌరవించిరి. నే నట్లు గౌరవించ లేదు కాని మానసమందు మిక్కిలి గౌరవించితిని. అప్పటినుండియు దక్షప్రజాపతి నాయం దాగ్రహగ్రస్తుఁడై

యున్నాఁడు. మఱియు నన్నవమానించుట కుపాయ మన్వేషించు చున్నాఁడఁట. నీకుఁ గష్టముగ నుండు నని తలఁచి యీవిషయ మిన్ని దినములుగఁ జెప్పకుంటిని.

ఈమాటలు విని సతి చింతానిమగ్నయై ముహూర్తకాలము మౌనమును ధరించి యుండి తిరిగి భర్తనుజూచి యిట్లనియె. 'ప్రభూ; ఇప్పుడు నాకర్తవ్య మేమి?'

కైలాసనాథుఁడు:- 'పరమానందముతోడఁ బతిసేవ సేయుచుండుటయే నీకర్తవ్యము' అని చిఱునవ్వు నవ్వుచు నిట్లనియె. 'నేను యజ్ఞమున కేఁగినయెడల నీ వసంతుష్ట చిత్త వగుదువుకదా! అటులే నీవు యజ్ఞమున కేఁగినయెడల నేను శాంతచిత్తమున నుండఁ జాలను. కావున మనమిరువురము పరమానందముగ నిచ్చటనే యుందము. ఇదియే మన కర్తవ్యము.'

సతి—ప్రభూ! భర్త యజ్ఞ భాగము నుండి వంచింపఁబడి, దేవసమాజచ్యుతుఁడై నప్పుడు, భార్య సహించి యెట్లూరకుండఁ గలదు?

ఇట్లనుచు సతి సజలనయనములతోడఁ గైలాసనాథుని వంకఁ జూడసాగెను.

కైలాసనాథుఁడు:—దేవీ! నాకు యజ్ఞభాగ మెందులకు? దేవసమాజ మెందులకు? నే నన్నిటిని బరిత్యజించితిని. మఱియు నాకైలాసము, కైలాసేశ్వరి యగుసతి యక్షయముగ నుండ నాకేమికొదువ! అందువలన దక్షుఁడు చేసిన కార్యములకు సంతసించుచున్నాను.

సతి—ప్రభూ! మీరు సంతసింపవచ్చును. కాని, నేను మిక్కిలి వగచుచున్నాను. మీ రాజ్ఞయొసంగిన యెడల కనకఖలమున కేఁగి పతియవమానమును, తండ్రి యమంగళత్వమును దీర్చివత్తును.

కైలాసనాథుఁడు—దేవీ! అది యసంభవము. నీవు నీతండ్రి ప్రకృతి నెఱుంగవు. ఆతఁ డహంకారాంధ బధిరుఁడు. సదుపదేశము లాయన కర్ణములఁ జొరవు. కావున నీ వేగుట వలన నణుమాత్రమైనను బ్రయోజనము లేదు. మీఁదు మిక్కిలి ప్రమాదము గలుగవచ్చును.

సతి:-ప్రభూ! నా కేఁగుట కనుజ్ఞనిండు తండ్రివలన భర్తకుఁ గలిగిన యవమానమును. సహించి యే స్త్రీ యుండఁ గలదు? ఒక వైపున భర్తకు మానహాని, రెండవవైపున దండ్రి కమంగళమును దెలిసికొని నిశ్చింతగ నుండు టెట్లు? కావున నా కేఁగుట కనుజ్ఞ నొసంగుఁడు. నాతండ్రి పాదములమీఁదఁ బడి యీ యవమానమును దొలఁగించెదను.

కైలాసనాథుఁడు—దేవీ! విపరీత ఫలము గలుగవచ్చు నని తోఁచుచున్నది. నీ వవమానమును దూరము సేయుట కేఁగి యవమాన

మందుఁ బడిపోయెదవు. దానిని సహింపఁ జాలవు. కావున నీ ప్రయత్న ముడుఁగుము. మన మిర్వురము కైలాసమందు మహాసుఖముగఁ గాలము గడపుచుందము. సతీ! నీతండ్రి ధనాంధుఁడు. నీ భిక్షువేషమునుజూచి త న్న వమానించి నవ్వైంచుకొనును. అందువలన నన్ను నిందించును. నీ వానిందావాక్యములను విని సహింపఁజాలవు.

సతి—నాకైశ్వర్యమున కేమి కొఱంత? కుబేరుఁడు ధనాగారాధిపతియై యుండ, విశ్వకర్మ శిల్పియై యుండ, నా కైశ్వర్యమునకు లోపమా? ఆజ్ఞ యైనయెడల మహైశ్వర్యము తోడనే యేఁగుదును.

దక్షుఁ డవమానించు నని చెప్పినప్పుడు, సతీదేవి న న్నవమానించు వా రెవ రని తర్కించి, కాళి, భువనేశ్వరి, కమల, మొద లగు దశమహావిద్యల స్వరూపమును జూపి

కైలాసనాథుని సంశయ నివృత్తిఁ జేసె నని యొకపురాణ కథగలదు.

కైలాసనాథుఁడు—నామాట వినుము. నీ వేఁగవలదు. యజ్ఞపరిణామము, నీకుఁగాని నాకుఁగాని, దక్ష ప్రజాపతికిఁగాని, క్షేమ దాయక మని తోఁచుట లేదు. ఆయన నన్నవ మానించుటకే యాయజ్ఞమును దలపెట్టి యున్నాఁడు. కావునఁ బిలువని పేరంటమున కేఁగఁజనదు. నామాట వినుము.

సతి—ప్రభూ! పుట్టినింటి కేఁగుట కాహ్వానము గావలయునా? నాతల్లి నాకై యుపవసించుచున్న దని దేవర్షి చెప్పెనుగదా! ఆవిషయము నన్ను బాధించుచున్నది. మఱియు, నాకవమానభయము లేదు. నాతండ్రి నన్నవమానించునా? అవమానించినను నాకు సమ్మతమే. భర్త్రవమానమును బోఁగొట్టఁజాలని భార్య యొక్క సతీత్వమాహాత్మ్యము వృథాకదా?

మఱియును మిమ్ము యజ్ఞమున కాహ్వానించిన యెడల తండ్రియజ్ఞ పరిణామము మంగళ ప్రద మగును. భర్త్రవమాన కళంకము మాసి పోవును.

కైలాసపతి—దేవీ! నీయిష్టము. నీ వేఁగ వచ్చును. కాని, సంగతి సందర్భముల నను సరించి ప్రవర్తింపుము. నా కనుమానముగ నున్నది. యజ్ఞపరిణామము క్షేమదాయక ముగఁ దోఁచుట లేదు.

అని సతీదేవికి సెల వొసంగి కైలాస నాథుఁడు తపోనిమగ్నుఁ డాయెను.

---

# ఏడవ ప్రకరణము

'సతి వచ్చెను.' 'సతి సచ్చెను.' అను వార్త కనకఖలమందంతటను వ్యాపించెను. దివ్యతేజోమయమూర్తి యగు సతిని దర్శించినవారెల్లరు భక్తిభరమునఁ బ్రణామంబు లాచరించిరి. సతి యెవ్వరితోడను మాటాడక సరాసరి దక్షుని సౌధరాజమును జొచ్చి తల్లి గదిలోని కేఁగెను. ప్రసూతి యచ్చట నిద్రాహారముల మాని నేలమీఁదఁబడి రోదనము సేయుచుండెను. సతి యామెకడ కేఁగి మృదుమధుర స్వరమున 'అమ్మా! వచ్చిన దెవరు?' అని నుడువుచు నామె నానుకొని కూర్చుండెను.

ప్రసూతి కర్ణముల కీ వాక్యము లమృతోపమానములై యులికిపడి లేచి పుత్రికను గాంచి, గాఢాలింగన మొనర్చుకొని, వక్షస్స్థలమం దదుముకొని 'అమ్మా! వచ్చినావా; ఈ జన్మమున నిన్నుఁ జూచెద ననుకొనలేదమ్మా!' అని వాత్సల్య రసమున సతీదేవిని స్నానము జేయించుచు, ముద్దిడుకొనసాగెను. వారిరువురి నేత్రములనుండి యానందాశ్రువులు వెల్లివిరియుచుండెను.

ఇట్లొకటి రెండు నిముసములు గడచిన పిమ్మట సతి యిట్లనియె. 'అమ్మా! నాయనను జూచివత్తును.' అని ప్రసూతి కౌఁగిలినుండి తప్పించుకొన నామె తిరిగి సతిని గట్టిగఁ బట్టుకొని 'అమ్మా! వలదు. ఆయన యజ్ఞమంటపమం దున్నాఁడు. నీవచ్చటి కేఁగవలదు. పిమ్మట నాయనను జూడవచ్చును.' అని చెప్పుచుండ సతి 'కాదు, ఒక్కమాటు చూచి యిప్పుడే

వచ్చెదను' అని చెప్పుచు బలవంతముగ నామె కౌఁగిలినుండి తప్పించుకొని బయలుదేరెను.

రాజప్రాసాద సమ్ముఖమందున్న విశాల దేశమందు, యజ్ఞశాల నిర్మింపఁబడెను. యజ్ఞసందర్శనార్థము లక్షలకొలఁది జనులు వచ్చియుండిరి. సన్న్యాసులు, సాధువులు, ఋషులు, మహర్షులు, దేవర్షులు, పండితులు, రాజులు, మహారాజులు, స్త్రీలు, మొదలగు వారు యజ్ఞశాల నిండియుండిరి. యజ్ఞశాల మధ్య వేదిక యమర్పఁబడెను. దానిపై ఋత్విక్కులు మండలాకారముగఁ గూర్చుండియుండిరి. వారిమధ్యఁ గూర్చుండి దక్షప్రజాపతి విరామము లేక హోమము సేయుచుండెను. ఆ యుత్తాపమువలన నాయన మూర్తీభవించిన యగ్నిహోత్రుని పగిది నలరారుచుండెను. అగ్నిహోత్రుఁడనేకజిహ్వాలతోడ జాజ్వల్యమానముగ వెలుంగుచుండెను.

పవిత్ర హోమధూమము నలుదిక్కులం బ్రస రించుచుండెను. అవిరత వేదగానమువలన సభ్యు లెల్ల రాకర్షింపఁబడి ముగ్ధులై, కీలుబొమ్మలవలె తల లూఁచుచుండిరి.

సతీదేవి యజ్ఞశాలను జొచ్చినంతనే సం భ్రముతోడ సభ్యు లామెకు మార్గమును విడుచుచుండిరి. ఆమె యిటునటుఁ జూడక త్వరితగతిని వేదిక కడ కేఁగి తండ్రికి సాష్టాంగ దండ ప్రణామం బాచరించి లేచి నిలచి చేతులు జోడించుకొని యుండెను. ఒక్క ముహూర్తకాలము ఋత్విక్కుల మోము నుండి మంత్రములు వెడలకుండెను. హోతహ స్తము లాహుతుల విడువకుండెను. కారణ మే మని దక్షుఁడు కను లెత్తి చూడ సతి సమ్ముఖమందుఁ గాన్పింప వికసిత వదనుఁడై 'అమ్మా! సతీ! వచ్చినావా?' అని నుడివి కను చూపులతోడ నామెను గాఢాలింగనం బొ

నర్చుకొనెను. సతి మోమునందు మంద స్మితము తాండవం బాడఁజొచ్చెను. ఆహా! ఆదృశ్యము స్వర్గదృశ్యము గదా!

కాని మఱుక్షణముననే దక్షుని, ఆ భావము, ఆ చూపు, ఆ ప్రఫుల్లవదనము, మాఱిపోయి, మోమెఱ్ఱవడెను. కనులనుండి యగ్ని కణములు వెల్వడసాగెను. శరీరము కంపించుచుండ దక్ష ప్రజాపతి యిట్లనియె. 'సతీ! యజ్ఞమునకు నిన్నెవ్వరు పిలిచిరి? ఏల వచ్చితివి?'

ఈ మాటలు విషపూరిత బాణతుల్యములై సతీహృదయమును విద్ధమొనర్చెను. ఆమె యెప్పుడును దండ్రినోట నిట్టి మాటలను వినియెఱుంగదు. కాని సతి పొంగి పొరలు దుఃఖ మాఁపుకొని, 'నాయనా! మిమ్ముఁ జూచి చాలదినములైనది. అందువలన వచ్చితిని.' అని వచించెను.

కరుణారస పూరితము లగు సతీ వాక్యములు, సభాసదుల హృదయములను గరంచుచుండెను. కాని దక్షుఁడు కర్కశస్వరమునఁ దిరిగి యిట్లనియె. 'నీ వెందుల కీయజ్ఞమునకు వచ్చితివి? ని న్నెవ్వరును బిలువలేదే.'

సతి–తలిదండ్రులఁ జూచుట కాహ్వానము గావలయునా? నా యంతటనే వచ్చితిని. న న్నెవరును బిలువలేదు.

దక్షుఁడు:–ఇవి దక్షప్రజాపతి పుత్రికనోట నుండి రాఁదగిన మాటలు గావు. ఆలజ్జావిహీనునిభార్య నోటరావలసిన మాటలు——.

అని యేమో పల్కుచుండ సతి చెవులు మూసికొని, 'నాయనా! అకారణముగ నాయన నేల దిట్టెదరు?'

దక్షుఁడు:–(మండిపడుచు) లజ్జాశూన్యుఁ డనిన తిట్టుటయా? ఆకాశమే వసనము గాఁ గలవానిని లజ్జాశూన్యుఁ డనిన తప్పేమి? అనా

చారుఁ డగుటవలననేకదా, వానికి స్వర్గమందు స్థానము లేకుండెను. స్మశానము, భస్మము, విషములయందు ప్రీతిగలవానిని లజ్జావిహీనుఁ డనుట కేల సందియింపవలయును? మఱియు నాతఁడు మూర్ఖుఁడు.

సతి-తండ్రీ! లజ్జావిహీనుఁడు గానిమ్ము. మూర్ఖుఁడు గానిమ్ము. ఆయన నాప్రాణవల్లఁభుడు. నాకు దేవుఁడు. కావున నకారణముగ నాయనను నిందింపఁకుడు, ఆనిందా వాక్యముల వినుటకంటె మరణమె నాకు సర్వవిధముల శ్రేయము.

ఈ మాటలు వినుచున్న కొలఁదిని దక్షుని కాగ్రహ మినుమడింపఁ బండ్లు పటపట కొఱుకుచు, 'దుర్మార్గురాలా?' అని నుడివెను.

అప్పుడు సతి యిట్లనియె. 'తండ్రీ! శాంతింపుఁడు. మమ్ము క్షమింపుఁడు. ఏదయిన నపరా

ధమును మే మొనర్చినయెడల దానికిఁ బ్రాయశ్చిత్తము లేదా?

దక్షుఁడు-ఉన్నది. లేకేమి; నీవు చచ్చుటయే దానికిఁ బ్రాయశ్చిత్తము. నీవు చచ్చిన ముహూర్తమునుండియు, నాయధమునితోడి సంబంధము నాకుఁ దీరును. అప్పుడు నా ద్వేషము నశించును.

సతి-ఇదియా తమ యాదేశము? తండ్రీ! తమ యాదేశము నెఱవేఱుఁగాక. నామరణము వలనఁ గాని తమకోపము చల్లాఱదా?

దక్షుఁడు-చల్లాఱదు. అప్పుడుగాని యా ఖలునకు నాకు సంబంధము తీఱదు.

సతి-తండ్రీ! అటులే యగుగాక. నామృత్యువువలన మీరు రాగద్వేషరహితులై మీయల్లుని యపరాధముల మఱచి, ఆయనను నిందింపకుండినయెడల నాకు మృత్యువు మహానందదాయకము గదా? తండ్రీ! తమ

యా దేశ మిప్పుడే పాలింతును. మీ నిశ్చితాభిప్రాయమంత యేకదా?

దక్షుఁడు-అవును. అదే నిశ్చితాభిప్రాయము. ముమ్మాటి కదియే. దక్షుని మాటల యందు ద్వంద్వార్థము లుండునా; 'నీవు చచ్చినఁగాని నాకు శాంతి గలుగదు.'

దక్షుని వ్యవహారమును గాంచి సభాసదులు నిర్విణ్ణులైరి. కొంతమంది యచ్చటనుండి లేచిపోయిరి. కైలాసనాథుని యనుచరులు దక్షుని సంహరించుట కాతురులై సతీదేవి వంకఁ జూచుచుండిరి.

సతి తండ్రికి నమస్కరించి, యజ్ఞకుండపార్శ్వమం దుత్తరాభిముఖియై యోగాసనముమీఁదఁ గూర్చుండి పయిఁట చెఱఁగు తోడ మోము గప్పుకొనెను.

సభాసదులు రాతి ప్రతిమలవలెఁ జూచుచుండిరి. కాని యామె యుద్దేశమును

గ్రహింపఁజాలరైరి. అందువలన నెవరామెను నివారించుటకుఁ బ్రయత్నింపకుండిరి. నందీశ్వరుఁడు మొదలగువారు త్రిశూలములనెత్తి యాతురతతోడ 'అమ్మా' యని పిలచుచుండిరి.

ఇట్లు చూచుచుండ ముహూర్త కాలములో నామె దేహమునుండి యపూర్వజ్యోతి వెల్వడెను. ఆ జ్యోతియెదుట హోమాగ్ని శిఖలు తేజోవిహీనము లయ్యెను. స్థానభ్రష్టత నొందిన దేవీప్రతిమవలె సతి భూతల శాయిని యయ్యెను.

---

# ఉపసంహారము

కైలాసనాథునకుఁ దపోభంగము గలిగెను. నలుదిక్కులఁ జూచెను. సతి కాన్పించదయ్యె. అజ్ఞాత మగు నాశంక యొకటి యాయన హృదయమును బరితపింపఁజేయఁ జొచ్చెను. అందువలన నాతఁడు 'సతీ! సతీ' అని యఱచుచు నున్మత్తుండై పరుగిడఁజొచ్చెను. కైలాస మంతయుఁ దిరిగెను. గాలించి వెదకెను. కాని సతి యెక్కడ?

అప్పుడాయన కస్పష్టస్మృతివలన దక్షుని యజ్ఞము మాట జ్ఞప్తికి వచ్చి పరుగిడుచు, 'సతీ, సతీ' అని యఱచుచుండెను. ఆయన వెన్నంటి వీరభద్రుఁడు మొదలగు మహావీరులు వచ్చుచుండిరి. కనకఖలమును సమీ

పించినంతనే కైలాసనాథుని విచార మినుమడించెను. ఉన్మత్తత వృద్ధి యాయెను. 'సతి యెక్కడ! సతి యెక్కడ!' అని కేకలిడుచు, త్రుటిలో యజ్ఞశాలను బ్రవేశించెను.

వీరభద్రుఁడు మొదలగువారు యజ్ఞమును ధ్వంసము చేసి దక్షుని శిరమును ఖండించిరి. కైలాసనాథుఁడు, సతీదేహమును స్కంధము పై వేసికొనెను. వెంటనే యాయన దృష్టి సతియందు విలీన మయ్యెను. అప్పు డాయనకు బాహ్యజ్ఞానము లేకపోయెను. త్రోవ డొంకలు తెలియవు. రాత్రింబవ ళ్లెఱుంగఁడు. కేవలము తన్మయత్వము! గభీరతన్మయత్వము! అనిర్వాచ్య మగు తన్మయత్వము! ఆ తన్మయత్వమున నృత్యముఁ జేయుచు తిరుగుచుండెను. దానికి భూమి కంపించుచుండెను. సూర్య చంద్రులు వణంకుచుండిరి. ఆనృత్యమందు, ఆయనంత ప్రేమనృత్యమందు, సతీ

మృతదేహము ముక్కలు ముక్కలై యెగిరి భూతలమునం దక్కడక్కడఁ బడి యాయా స్థానములఁ దీర్థస్థానములుగఁ జేయుచుండెను. పుణ్యతీర్థములుగఁ ఆయన యడుగిడిన ప్రదేశ మంతయుఁ బవిత్ర మగుచుండెను. ఆప్రదేశమే గాదు. భారతవర్షము, జగత్తంతయుఁ బవిత్రమాయెను. పంచ భూతములుఁ బవిత్రములైనవి. ఆ జంటయే, ఆ మహాప్రేమదాంపత్యమే పశుపక్షి క్రిమి కీటకాదుల కాదర్శము! ఆర్యావర్తమం దెక్కడ నడుగిడినను, ఏ తీర్థమున కేఁగినను, ఆ దేవదంపతులు గన్పట్టుచుందురు. ఇంత యేల! ఆ దాంపత్య ప్రేమయే భారతవర్షము యొక్క హృదయము!

స్కంధమందలి భారము తొలంగినంతనే కైలాసనాథుఁడు కనులు విచ్చిచూచెను. వెంటనే యువసన్న శరీరుఁ డాయెను. వైరాగ్య

మాశ్రయించెను. హిమాలయ శిఖరమున కేఁగి సతీ ధ్యానమందు యోగాసనాసీనుఁ డయ్యెను!

సతి ప్రాణములు విసర్జించిన స్థలమందు చిన్న కోనేరొకటి నేటికిని గన్పట్టుచున్నది భాగీరథీనదీమతల్లి యా దేవదంపతుల పావన చరిత్రమును, యుగ యుగాంతరములనుండి మానవజాతికి బోధించుచు 'సతీదేవి పతిభక్తి యుత్కృష్ట మైనదా! లేక, కైలాసనాథుని పత్నీప్రేమ యుత్కృష్టమైనదా!' అని ప్రతి యాత్రికుని బ్రశ్నించుచుండును.

సంపూర్ణము

STATE LIBRARY

Kesari Printing Works Madras.